


నన్నంతా నల్లమావ అని పిలుస్తారు. అది నా దౌర్భాగ్యం. నేను నల్లగా, పొట్టిగా, లావుగా ఉంటాను. నా కళ్ళు చింత నిప్పుల్లా ఎర్రగా ఉంటాయట. స్ఫోటకపు మచ్చలతో నా ముఖం చూడ భయంకరంగా ఉంటుందట. నాకు కోప మొస్తే నా ముఖంలోకి ఎవరూ చూడలేరట. నల్లమావ అన్న పేరు చిన్న పిల్లలుగల తల్లి దండ్రుల పాలిట శ్రీరామ రక్షట.

నేను అందంగా లేకపోవచ్చు. నా ముఖం వికృతంగా ఉండవచ్చు. నన్నంతా నల్లమావ (ఏదో భాషలో 'నల్లమావ' అంటే 'మంచి మావ' అని అర్థంట. కాని ఆ మావను మాత్రం నే కానట) అని పిలిచినంత మాత్రాన నాకు పోయే దేమీలేదు. నా హృదయాన్ని ప్రేమించే మా శ్రీమతి, నా ముఖంతో ఆడుకునే మా అమ్మాయి కళ్యాణి నన్ను ప్రేమానురాగాలతో చూస్తూం డగా యితరులు నా గురించి ఏమనుకున్నా నాకు బాధలేదు.

నాకున్న బాధంతా ఒకటే. నేను వికృ తంగా ఉన్నంతమాత్రాన నేను రాక్షసుడను కాను. నాది రాక్షసహృదయం కాదు. నేను మానవుడను. చిన్న పిల్లలతో ఆడుకోవాలనే మనసు నాకు ఉంటుంది. నా రూపు వికృతంగా ఉన్నంతమాత్రాన నేను పిల్లల్ని చేరనేకూడదా? వారిని ప్రేమతో పిలవకూడదా? నే చేసిన తప్పే మిటి? నాతో తిరిగి నాలో మంచితనాన్ని అర్థం చేసికోడానికి వీలు లేకండా చేసిన ఆ తల్లి దండ్రుల నేమనాలి? నేను మాత్రం ఏమీ అనను.

ఉద్యోగంకోసం ఆంధ్రదేశం వదలి బెంగా లులో స్థిరపడిపోయి సంవత్సరానికి పైచిలు కైంది. ఈ మధ్యకాలంలో నా భార్యాపిల్లల చూచే అవకాశం రానేలేదు. నే సంపాదించిన సొమ్ము నాకూ, నాకు కొన్ని వందలమైళ్ళ దూరంలో ఉన్న కుటుంబానికే సరిపడనప్పుడు అంతదూరం ఎంతో సొమ్ము వ్యయపరచి వెళ్ళి రావటం ఎలా సాధ్యమవుతుంది? కొద్దికాలం ఉద్యోగంలో స్థిరపడితే గాని ఇంటికిరానని, అంతవరకూ కుటుంబాన్ని తీసికెళ్ళనని ఉత్తరం రాసేశాను. అలా రాసేశానేగాని నా మనసు మాత్రం మా కళ్యాణి వెనుకనే పరిగెడుతోంది. నా మనసంతా కలయతిరిగేది కళ్యాణే! మా ఆరేళ్ళ కళ్యాణి.

మీకు మా కళ్యాణి గురించి చెప్పలేదు. అసలు మీరు మా కళ్యాణిని చూచి ఉండరు. చూస్తే వదలిపెట్టరు. దాని మాటలు, ముద్దొచ్చే దాని చేష్టలు, ఎప్పుడూ నవ్వుతూండే దాని ముఖం నా మనసులో మెదలుతునే ఉంటాయి. రాత్రి నిద్రపోయే ముందు నా కెన్నో కథలు, పాటలు వినిపిస్తుంది. అది పాటలు పాడే టప్పుడు దానివైపునే చూడకూడదు. రెండుచేతు లతో కళ్ళు మూసికోవాలి. (అది చూడకండా దాన్ని నే చూడొచ్చనుకోండి) అది పాటపాడేసి 'కళ్ల తెరువు' అంటేనే నే కళ్ల తెరవాలి. అది పాటపాడేటప్పుడు వాళ్ళమ్మ దాని సమీపంలో ఉండకూడదు. పాట వినకూడదు. ఎన్ని కండి షన్లూ! ఎంత కథా!!

మా కళ్యాణి ఎంత చక్కగా డాన్సు చేస్తుందనుకున్నారు! కొండపల్లి బొమ్మలా, చక్కగా కళ్ల తిప్పుతూ, ఏవో హావభావాలను ప్రదర్శించ ప్రయత్నిస్తూ నన్నెప్పుడూ ఆనంద పరుచ ప్రయత్నిస్తూంటుంది. అది పాట పాడి అలసిపోతే వాళ్ళమ్మ పాట పాడవచ్చు. అంతే దాని నృత్యం చూడవచ్చన్నమాట.


దానివన్నీ వింతైన కబుర్లు.

ఒకరోజు రాత్రి వర్షం పడుతూంటే ఆకా శంలో మెరుపుల చూచి నాతో ఏమందో తెలుసా?

'నాన్నారూ, అదేమిటీ! మబ్బుల్లో దీపాలు వెలుగుతూ, ఆరిపోతున్నాయి. ఓహో! వర్షం పడి దీపాలు ఆరిపోతున్నాయా? అయితే దీపాల నెవరు వెలిగిస్తున్నారు? దీపాలు ఆరిపోతే వాళ్ళెలా అన్నం తింటారు? వాళ్ళకి భయమే యదూ?' అని. ఆనాటికి మా వూరికింకా ఎలక్ట్రి సిటీ రాలేదు.

ఎప్పుడైనా కోపం వచ్చి కోపంగా దాని వైపు చూశాననుకోండి. చూపులు దించేసికుని మౌనంగా వెళ్ళిపోతుంది. ఆ రోజు ఎవరితోనూ మాటాడదు. నేవెళ్ళి బ్రతిమాలి తెచ్చుకుంటేనే గాని భోజనం కూడా చెయ్యదు.

మా కళ్యాణి గురించి ఎంత చెప్పినా తర గదు. ఏమిటో మా కళ్యాణి గుర్తుకొచ్చినప్పు




డల్లా ఇలా మాటాడేస్తూంటాను. అది గుర్తు కొస్తే నా మనసు గట్టునపడ్డ చేపలా గిలగిల లాడిపోతుంది. ఏం చేయనూ? అసలు దాన్ని విడిచి ఇంతదూరం రావటం దానికి సుతారం యిష్టమేలేదు. చివరికి వాళ్ళమ్మ దాని కెంతో నచ్చచెప్పి దానికి మంచి బంగారు గాజులు చేయించుకో రమ్మని చెపితే తన చేతినున్న రెండు రబ్బరుగాజులు (రెండు గాజులకు రెండు మాదిర్లు ఉండాలట — మా కళ్యాణే చెప్పింది) తీసి నాకిచ్చి తనకు గాజులు చేయించుకో రమ్మని పలుసార్లు హెచ్చరించింది. నిజానికి ఇంత దూరం వచ్చేసిన తరువాత దాని గాజుల గురించి ఎలాంటి ప్రయత్నం చేయలేకపోయాను. ప్రతీరోజూ రాత్రి దాని చేతి గాజుల చూచుకుని కళ్యాణిని నానుండి దూరంగా ఉంచిన పరిస్థితులను తలచుకొని బాధ పడేవాడిని.

మల్లెపూవుల చూచినా, ఎర్రటి గాజుల చూచినా, ఎర్రగా సన్నగా పొడవుగా రెండు జడలతో, చెవులకు రింగులతో ఏ చిన్నపిల్ల కనిపించినా నా కళ్యాణే నేమో అని భ్రమసి పోతాను. కళ్యాణి గుండ్రటి కాటుక కళ్ళనే ఆ పిల్లలో చూస్తూ గంటలకొలది నిలబడిపోతాను. ఎక్కడైనా మా కళ్యాణి తరచుగా పాడేపాటలు వినిపిస్తే నా కళ్ళు చెమ్మగిల్లుతాయి. అచేతనుడనై పోతాను.

ఆనాడు అంతే జరిగింది. సరిగా అలాగే జరిగింది. ఆనాటి సాయంత్రం 'వర్కు-షాపు' నుండి 'ఓవర్ టైము' వర్కు- పూర్తిచేసుకుని నాతోపాటూ పనిచేసే మిత్రుడితో మాటాడుతూ దారిలో అతన్ని అతనింటి వద్ద దిగవిడిచి చలిలో ఇంటివైపు చకచకా నడవసాగాను. ప్రతిదినం నే వచ్చే దారి మాత్రం కాదది.

ముందుకు వెడుతున్న నా కాళ్ళకు బంధాలు పడ్డాయి. పరధ్యానంనుండి తేరుకున్నాను. నా శరీరం ఒక్కసారి గగుర్పొడిచింది. అటు ఇటూ పరికించి చూశాను. నా కెదురుగా ఉన్న రైల్వే క్వార్టరులో విద్యుద్దీపం వెలుగులో చక్కగా చేతులు తిప్పుతూ, అందంగా కళ్ళు తిప్పుతూ పాటపాడుతూ, ఆయాసపడుతూ, పాటలో కొన్నికొన్ని పదాలు మింగేస్తూ నలుగురైదుగురు పిల్లల మధ్య వీధి జాఫ్రీలో డాన్సు చేస్తోంది మా కళ్యాణి లాంటి ఒకమ్మాయి. నాలో ఆనందం అవధులు దాటింది. ఏదో అవ్యక్తమైన తృప్తి నా గుండెల్లో నిండిపోయింది. ఆ పాపను దరికి తీసికొని తనివితీరా నా చేతుల్లో ఉంచుకోవాలనీ ఆరాటపడింది నా మనసు. ఇంటిముందున్న గేటు నానుకొని పాప నృత్యాన్ని తనివితీరా చూశాను. పాప నృత్యం అయిపోయింది. నా ఆనందానికి అంచులు తెగాయి. ఆనందంగా చప్పట్లు కొట్టాను. తెరచి ఉన్న గేటులోంచి లోపలికి పోబోయాను. పిల్లలంతా నా వైపు చూశారు. దీపపు వెలుగులో నా ముఖం వారికి కనిపించి ఉంటుంది. కెవ్వున కేకలు వేస్తూ పిల్లలంతా ఇంటిలోపలికి పరుగెత్తిపోయారు. ఏమిటేమి టంటూ ఒకాయన వీధిలోకి వచ్చారు. నాకు నోట మాట రాలేదు.

అతను మెట్లు దిగి నన్ను చూశారు. నే నతన్ని చూశాను. అతని ముఖం నాకు పరిచయమే. వర్కు-షాపులో నాకన్నా సుమారు రెండు రెట్లు జీతం తీసికునే ఉద్యోగతను. మేమిద్దరం మాటాడుకునే అవసరం కాని అవకాశం కాని రాలే దింత వరకూ.

నే నమస్కరించాను. అతనూ నన్ను గుర్తించి నమస్కరించారు. అతను ప్రశ్నించే అవసరం లేకుండా నేనే అన్నాను.

''పాప డాన్సు చూస్తున్న నన్నుచూచి పిల్లలంతా భయపడ్డారు,'' అని.

నా మాటలు అతనిలో ఏదో సంచలనాన్ని కలిగించాయి.

''అబ్బే! అదేం కాదు. పెద్ద వాళ్ళెవరు గమనించినా, చిన్న పిల్లలు అలా సిగ్గుతో పారిపోవటం సహజమే. రండి 'ఛా' త్రాగి పోదురుగాని'' అని ఆహ్వానించా రాయన. అతని సమాధానంలో కనిపించే ప్రశంసనీయమైన సంస్కారానికి చాల సంతోషం కలిగింది.

నే కూర్చున్నాను. ఆయన లోపలికి వెళ్ళి కొద్ది సేపటిలో రెండు కప్పులతో 'టీ' పట్టుకొనివచ్చి ఒక కప్పు నా కిచ్చారు. ఈ అలవాటు సుమారు ప్రతీ యింటా ఉన్నదే. ఏ వేళ ఏ ఇంటికి అతిథిగా వెళ్ళినా అక్కడ కమ్మని 'టీ' ని ఆతిథ్య మివ్వటం పరిపాటి. ప్రేమతో యిచ్చే ఆ 'టీ'ని తిరస్కరించే అవసరం ఎవరికీ ఉండదు. సాయంత్రం అయిదుగంటల నుండి, ఉదయం ఎనిమిది గంటలవరకూ శరీరాన్ని కొరికి తినివేసే చలిలో, జల్లుగా పడే మంచులో, సుకుమారంగా వీచే చలిగాలిలో శరీరోష్ణోగ్రత నార్మల్ నుండి దిగిపోతుందేమో అని అనిపించే వేళ ఒక కప్పు టీ, అభిమానంతో ఇచ్చేవారివల్ల ఆనందాన్ని, హాయినీ కొనితెస్తుందనటంలో సందేహం ఏముంది? ఉదయం ఆరుగంటలకల్లా 'పుంగా' పిలుపుకు సిద్ధపడి ఎముకలు కొరికే చలిలో ధైర్యంగా వర్కుషాపుకు పరుగెత్తే పనివాళ్లను చూచి ఉత్సాహం తెచ్చుకుని, అంతటి చలిలో ఒక చెట్టుక్రింద ఎంతకాలం నుండో స్థిరపడిన టీ దుఖాణంలో 'టీ' తాగుతూ, ఏదో ఆనందాన్ని రుచిచూస్తూ వర్కుషాపుకు పరుగెత్తటం దైనిక జీవితంలో ఒక వినూత్నానుభూతి. చలికాలపు రాత్రివేళల చెవుల చుట్టూ మఫ్లరు చుట్టీ, చెట్టుక్రిందనున్న టీ దుఖాణంలో టీ త్రాగుతూ (భోజనంచేసే ముందే) వర్కుషాపు రైలు బండీ కోసం వేచి ఉండటం మరొక అనుభూతి. భోజనమైన తరువాత హోటలునుండి బయలుదేరి ఎనిమిది గంటలకు బయలుదేరే వర్కుషాపు ట్రైనులో కూర్చుని కూనిరాగాలు తీసికుంటూ ఇంటి దగ్గరి 'స్టాపు'లో దిగి ఫాంటు రెండు జేబుల్లో చేతుల నుంచుకొని చలి నెదుర్కొటం, అకస్మాత్తుగా వచ్చే వర్షానికి దొరికిపోయి వర్షంలో చిత్తుగా తడవటం, గాలీ వాన రోజుల్లో వస్తులుండటం, చైనా అనవసరంగా ఇండియాపై కోపగించిన రోజుల్లో రేడియో ముందు ఉద్రేకపడటం నే మరువరాని మధురానుభూతులు.

'టీ' తాగుతున్న నాలో కదలే మధురానుభూతులనుండి తేరుకోక ముందే ఆయ నడిగారు "ఎక్కడుంటున్నారు?" అని.

చెప్పాను.

"అయితే మా ఇంటికి చాల దగ్గరన్న మాటే. ఎప్పుడైనా పిల్లల్ని తీసికునిరండి మా ఇంటికి." ఆతని ఆహ్వానానికి నాకు చాల సంతోషం వేసింది.

"కుటుంబం అంతా ఆంధ్ర దేశంలో ఉంది. నే నీ ఖర్గపూర్‌కు వచ్చి సంవత్సరం పైగా అయింది. ఇందాక ఎవరో పాప చక్కగా పాడుతూ, డాన్సు చేస్తూండటం చూశాను. ఆ పిల్ల మా కళ్యాణిలాగే ఉంది. చూస్తూండి పోయాను" అన్నాను. నేనా మాటలనటంలో బహూశా నా మనసులోని కోరిక వ్యక్తమై యుండి ఉంటుంది.

"ఇప్పుడు పాట పాడినదేనా! అది మా అమ్మాయే! శాంతి. ఉండండి తీసికొస్తాను." అంటూ ఇంటి లోపలికివెళ్ళి తీసికొచ్చాడాయన. కూతుర్ని తీసికుని అతని వెనుకనే వచ్చిందాతని శ్రీమతి.

పాపను చూశాను. మా కళ్యాణిని చూచినంతం ఆనందం కలిగింది. కాని పాప ముఖంలో మాత్రం భయం మూటకట్టుకుని ఉంది. బందిఖానాలో ఉన్న దానిలా ఎంత త్వరగా పారిపోదామా అని బిత్తర చూపులు చూస్తూ ఉండి పోయింది పాప.

'పాపను మచ్చిక చేసికోవాలి' అని అనుకుంటూ "ఆడుకో పాపా!" అన్నాను. నా మాట విని పాప ఇంటిలోకి పారిపోబోయింది. కాని ఆమె తల్లి పాప జబ్బ పట్టుకొని "మామయ్యగారి దగ్గరికెళ్ళు. నీ డాన్సు చూస్తారట" అంది.

పాప నా వైపు భయంతో చూస్తూండి పోయింది. పాపలో చలనంలేదు. "వెళ్ళనీండి పాపను" అన్నాను. నా మాటతో పరుగెత్తి పోయింది పాప.

"శాంతి ఎంత అల్లరి పిల్ల అనుకున్నారు! అబ్బబ్బా వేగలే మనుకోండి," కూతురు ముద్దు ముచ్చటలు చెప్ప సాగిందామె. "అది అన్న మాట జరిగి తీరవలసినదే. ఎంత చెప్పినా వినదు. మంకుపట్టు ఎక్కువ. చలికాలంలో అయిస్‌ఫ్రూటు ఎక్కడినుండి వస్తుంది చెప్పండి? ఒక రోజు రాత్రి తన కది కావాలని ఒకటే ఏడుపు. ఎంత చెప్పినా వినలేదు. అప్పుడు రాత్రికి రాత్రి వాళ్ళనాన్నగారు ఎక్కడినుంచో మంచు ముక్క తెస్తే, నే రహస్యంగా పంచదార వేసి యిస్తే తిని పడుక్కుంది. అబ్బబ్బా! చెడ్డ అల్లరి. స్నానానికి రమ్మన్నా, భోజనానికి రమ్మన్నా ఏదో కండిషనే! మీతో పట్టు కెళ్ళిపోదురూ! ఏదదీ! శాంతీ! ఈసారి అల్లరి చేశావంటే మావయ్యగారితో పంపించేస్తాను జాగ్రత్త" అంటూ కూతుర్ని హెచ్చరించిం దామె.

ఆమె తొందర పాటుకు బాధవేసింది నాకు.

"శాంతి చిన్నపిల్ల. చిన్నపిల్లలు కాక మరెవరు చేస్తారు అల్లరి! శాంతి నే మనకండి. మా కళ్యాణికూడా ఇంతే! అచ్చు శాంతే," అన్నాను.

"అలా చెప్పండి దానికి. ముద్దు చేసేదీ అదే! చావకొట్టి చెవులు మూసేదీ అదే," అన్నారాయన.

"ముద్దూ ముచ్చట పిల్లలకు కాక మరెవరికి? అవి అతి అయితేనే ప్రమాదంగాని మా కళ్యాణి..........అవును మా కళ్యాణి.......... ఏం చేస్తోందో" అంటూ లేచాను. గేటువరకూ సాగనంపుతూ "తీరికైనప్పుడు వస్తూండండి" అన్నారాయన.

కళ్యాణిని తలచుకుంటూ ఇల్లు చేరాను.

శాంతిలో కళ్యాణి కనిపించినందుకు మనసులో ఉల్లాసంగా ఉన్నా, శాంతి చిన్నారి హృదయంలో నాకు స్థానం లేదేమో అన్న సంశయం పీడించ సాగింది. శాంతికి దగ్గర కావాలనే కోరిక నాలో వృఢమైంది.

రెండు రోజుల తరువాత సాయంత్రం వేళ బిస్కట్ ప్యాకెటు తీసికొని శాంతి ఇంటి కెళ్లాను. శాంతి నాన్నగారింటలేరు. శాంతి అమ్మగారే నన్నాహ్వానించారు. నన్ను చూచి 'శాంతి' పారిపోయింది. నేనున్న అయిదు నిముషాల కాలంలో శాంతి ఆ పరిసరాలకు రాలేదు. ఏదో మాటాడుతూ ఆమె "శాంతి బుద్ధిమంతురాలైంది" అన్నారు. సెలవు తీసికుని వచ్చేశాను. 'శాంతి మంచి పిల్ల అయింది' అన్నదే



నా మనసును బాధపెట్టింది. శాంతి మంచి పిల్ల ఎలా అయింది? అన్నదే నాకు పట్టుకున్న సందేహం.

"నా పేరుచెప్పి శాంతిని భయపెట్టినందు వల్ల కాదూ శాంతి మంచి పిల్ల అయింది? శాంతి అల్లరి మాన్పించడానికి నా పేరు కాదూ ఉపయోగపడింది?—" నాలో భయం సుడులు తిరిగింది.

నన్ను చూచి శాంతి భయపడవచ్చు, కాని ఆ భయాన్నే ఎక్కువచేసి దానినే ఒక ఆయుధంగా ఉపయోగించుకునే ఆ తల్లి నేమనాలి? నేను మాత్రం ఏమీ అనలేను.

రెండు మూడు రోజుల తరువాత ఉదయం వర్కుషాపునుండి పదకొండు గంటలవేళప్పుడు వచ్చేస్తున్నాను. శాంతి ఒక చేత్తో పలక, పుస్తకం పట్టుకొని వస్తోంది. నాకు ఎదురు పడిన శాంతిని ఆపి "శాంతీ" అని ఎత్తుకోబోయాను.

శాంతి గట్టిగా; "నల్లమామ....అమ్మో! దొంగ....దొంగ బూచాడు....నన్నువదలు....నన్ను సంచీలో తీసికొని పోదామనా?........ అమ్మో.....నల్లమావ.....అమ్మా!.....నాన్నా! ....నన్నొదులూ" అంటూ అరవటం ప్రారంభించింది.

నేను నిశ్చేష్టుడనై శాంతిని వదలి పెట్టేశాను.

శాంతి నన్ను అన్నపదాలు మాత్రం నన్ను వదలి పెట్టలేదు.

'దొంగ....దొంగ బూచాడూ........నల్లమావ' పదాలు నా మనసులో సుత్తి దెబ్బలు కొడుతునే ఉన్నాయి. ఆ పూట భోజనం నాకు సహించలేదు.

శాంతికీ నాకూ మధ్యన అఖాతాన్ని తవ్వినదెవ్వరా అన్నదే నా సందేహం.

మర్నాడు శాంతి నాన్నగారు వర్కుషాపులో కనిపించి అంతకు క్రితం రాత్రి శాంతికి జ్వరం వచ్చిందని, ఏవో పలవరించిందని చెప్పారు. నాకు అర్థమైంది శాంతి ఏమని పలవరించిందో. నాకు తెలుసు శాంతికి ఎందుకు జ్వరం వచ్చిందో. శాంతికి జ్వరం రావటానికి కారకుడను నేనే! నా వికారమైన ముఖమే కారణం. శాంతి నా ముఖం చూడలేదు. చూచి బ్రతుకలేదు. శాంతిని చూడటంగాని, కలియ ప్రయత్నించటం గాని చేయకూడదని నిశ్చయించుకున్నాను. శాంతి ఆరోగ్యం కోసం దేవుని ప్రార్థించాను.

నా ముఖంతో ఆడుకునే కళ్యాణికి, నన్ను చూచి బెదరిపోయే శాంతికి గల తేడాలు నా మనసులో నిలిచిపోయాయి. ఆనాటి నుండి శాంతిని చూచే ప్రయత్నాల మానుకున్నాను. ఆనాటి నుండి నాలో మిగిలింది అశాంతి మాత్రమే. ఆనాటినుండి కళ్యాణే నాలో పదే పదే జ్ఞాపకానికి రాసాగింది.ఉద్యోగంమాని వెళ్ళిపోదామనిపించేది. కాని కళ్యాణి కిచ్చిన వాగ్దానాన్ని చెల్లించకుండా కళ్యాణి దగ్గరకు ఏమని వెళ్ళడం?

చాల రోజుల తరువాత శాంతి నాన్నగారు కనిపించారు. అడిగా నప్పుడు "శాంతి కులాసాగా ఉందా?" అని.

"కులాసాగానే ఉంది" అన్నారాయన.

"శాంతి ఇంకా అల్లరిచేస్తోందా? చెయ్యదు. బహుశా చెయ్యదు."

నా మాటలకు అయోమయంగా చూస్తూండి పోయాడు ఆయన.

"ఎప్పుడన్నా శాంతి అల్లరిచేస్తే నా పేరు చెప్పండి. నా పేరు చెపితే శాంతి భయపడుతుంది" అన్నాను.

అతను దీర్ఘంగా నిట్టూర్చి నా భుజం మీద చెయ్యి వేస్తూ, "నాకు అర్థమైంది. మీ ఉద్దేశ్యం గ్రహించాను. చాలసార్లు చెప్పాను. మా ఆవిడికి దెయ్యాలపేర్లూ, దొంగల పేర్లూ చెప్పి భయపెట్టవద్దని. కాని, క్షమించండి. మీ పేరు చెప్పిన దగ్గరనుండి శాంతి అల్లరి మానేసిందంటుంది మా ఆవిడ. ఈవిషయాన్ని సూటిగా చెపుతున్నందుకు మన్నించండి. చాలసార్లు చెప్పాను అలా చేయవద్దని. క్షమించండి మిమ్మల్ని బాధించినందుకు," అన్నారు.

"ఫరవాలేదు. క్షమించటానికి యిందులో ఏదీ లేదు. నన్నుచూచి అందరూ అస్సహ్యించుకుంటున్నందుకు నాకు బాధ లేదు. కాని నా పేరు ఒక చెడ్డ అలవాటుకు ఉపయోగపడుతున్నందుకు బాధగా ఉంది. దాని పర్యవసానం ఎంత చేటుగా ఉంటుందో అని ఆందోళనగా ఉంది. శాంతి అల్లరి మాన్పడానికి ఇది సరియైన ప్రయోగం కాదని నా అభిప్రాయం. శాంతి దృష్టిలో నే నొక రాక్షసుడను. ఆ భావం మాత్రం శాంతిలో ఉంచకండి. ఈ విషయంలో సహకరించమని చెల్లెమ్మగారికి చెప్పండి," అన్నాను.

"పదండి! ఛా త్రాగుదాం" అన్నారాయన బరువుగా నిట్టూర్చి.

వర్క్‌షాపు గేటు దగ్గరున్న టీ దుకాణంలో టీ త్రాగి విడిపోయాం.

పది రోజుల తరువాత-

ఆ రోజు ఆదివారం. వర్క్‌షాపుకు సెలవు. మధ్యాహ్నం దాటిపోయింది. నిద్ర లేచి గది కిటికీలోంచి వీధిలోకి చూశాను. ఆకాశమంతా మబ్బులతో నిండి ఉంది. వర్షం ఏ క్షణాన వస్తుందో తెలియకండా ఉంది. చల్లగాలి నెమ్మదిగా వీయసాగింది. గాలిలో తేమ వర్షం రాకను సూచించసాగింది. గాలి ఎక్కువైంది. వీధిలో వెళ్ళేవారంతా వర్షం రాకను గమనించి గబగబా ముందుకు పోసాగారు. వర్షం చినుకులు గబగబా పడసాగాయి. కొద్దిసేపటిలో వర్షం పెద్దదైంది. వర్షం చినుకులు నేలను పడినప్పుడు వచ్చిన కమ్మని వాసనల నాఘ్రాణిస్తూ కుర్చీలో కూర్చుని వీధిలో పోయే జనంవైపు చూడసాగాను.

అంతలో వీధి అరుగు మీదికి ఎవరో వచ్చి ఆగినట్టు అనిపించింది. ఎవరో ఏమో లోపలికి పిలుద్దాం అని తలుపు తీశాను. వీధిలో పన్నెండేళ్ళ అమ్మాయి చేతిలో కొబ్బరికాయ ముక్కలు, పువ్వులు, అరటిపళ్ళు గల ప్లాస్టిక్ సంచీని పట్టుకుని వర్షానికి భయపడుతూ వీధి వరండాలో ఒక మూల ఒదిగి నిల్చుంది. ఆ అమ్మాయి ప్రక్కనే ఆ అమ్మాయిచేయి పట్టుకుని వర్షాన్ని వింతగా చూస్తోంది శాంతి. తలుపు తెరచిన ధ్వనిని విని నన్ను చూచి భయంతో గట్టిగా గావుకేక వేసికుంటూ చెంగున వీధిలోకి దూకింది శాంతి. వీధిలో కార్లు, రిక్షాలూ, లారీలు ఒకటే తిరుగుతున్నాయి. శాంతి ఏ కారు క్రింద పడిపోతుందో అన్న ఆందోళనతో "శాంతీ! ఆగు పరిగెత్తకు-బళ్ళు-కార్లు చూచుకో....పరిగెత్తకు..........నిన్నేమి చేయను....వెనక్కి వచ్చేయి. శాంతీ!........ శాంతీ!....." అంటూ వీధిలోకి పరుగెత్తాను.

శాంతి నా పిలుపు వినే స్థితిలో లేదు. వీధిలో తనకు తోచిన దిక్కు పరిగెడుతోంది శాంతి. నాకు దిక్కు తోచటం లేదు. శాంతి కే ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళనతో ముందుకు పరిగెత్తాను. నా వెనుక శాంతి స్నేహితురాలు వచ్చేసింది. శాంతికి ఏ ప్రమాదం రానీకండ ఇంటికి చేర్చటమే నా ఉద్దేశ్యం. శాంతి వెనుక పరుగెత్తటం ఎంత ప్రమాదకరమో, వెనక్కిపోవటం అంత ప్రమాదకరం అని గ్రహించాను. శాంతి కెదురుగా కారొకటి దొర్లుకుంటూ రాసాగింది. శాంతి కంగారుగా అటూ ఇటూ కారు ముందు పరుగెత్త సాగింది. "శాంతీ! శాంతీ! ఆగు" అంటూ కేకవేశాను. శాంతి ఆగలేదు. కారు శాంతి మీదకు ఉరకబోతోంది. శాంతిని సమీపించి ఒక్క ఉదుటున అందుకుని ఎత్తుకున్నాను. అంతే! అదే క్షణంలో తల కేదో బలంగా తగిలింది. కేకవేస్తూ క్రిందకు వాలిపోయాను. తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు. శాంతి ఏమయిందో, శాంతిని పట్టుకున్నానో విడిచిపెట్టేశానో నాకు తెలియదు. తల దిమ్మెక్కిపోగానే అలా ఎంతసేపున్నానో నాకు తెలియలేదు.

నాకు తెలివొచ్చేసరికి ఎదురుగా విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. ఎదురుగా డాక్టరు, శాంతివాళ్ళ అమ్మ నాన్నా నిల్చుని ఉన్నారు. 'శాంతి' జ్ఞాపకమొచ్చింది.

"శాంతీ!" అంటూ లేవబోయాను.

"కంగారు పడకండి. శాంతి క్షేమంగా ఉంది" అంటూ శాంతిని ఎత్తుకుని తీసికొచ్చారు శాంతి నాన్నగారు. శాంతి పాదానికి కట్టు కట్టి ఉంది. కళ్ళు చిట్లించి చూశాను. తల మీద రోకలితో బాదుతున్నట్టు, సూదులతో పొడుస్తున్నట్టు అనిపించింది నాకు. తల తడుముకున్నాను. తలకు కట్టు ఉంది.

"శాంతీ!" అంటూ శాంతివైపు చూశాను.

శాంతి నావైపు నిశ్చలంగా చూడసాగింది. ఆ కళ్ళలో భయం లేదు. నాకై సానుభూతి ఉంది. నాకు ధైర్య మొచ్చింది. "శాంతీ" అంటూ చేతులు చాచాను.

"మావయ్యా!" అంటూ నా చేతుల్లో ఒదిగిపోయింది శాంతి.

మనసు నిండ హాయి నిండింది.

"దెబ్బ తగిలిందా? శాంతీ!" అన్నాను శాంతి పాదాన్ని చూస్తూ.

"నాకేం! నాకేం తగల్లా మావయ్యా! నీకే తగిలింది. పేద్ద దెబ్బ. నావల్లే కదూ నీకీ దెబ్బ తగిలింది మావయ్యా! నాన్నారు చెప్పారులే. అమ్మ చెప్పింది. జానకి చెప్పింది. అందరూ చెప్పారు. నీవు చాలా మంచివాడివి మావయ్యా" అంది శాంతి ఒక్క గుక్కలో.

"కళ్యాణీ!" అన్నాను ఆనందంగా.

అంద విహీనమైన నా ముఖాన్ని తన చిట్టి చేతుల్లోకి తీసుకుని నా చేతులో ఉండిపోయింది శాంతి——

——:o:——